సాక్షి రంగారెడ్డి

బుధవారం । 31 । మే । 2023



ప్రాణం తీసిన పంచాయితీ

తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి వాటా విషయంలో అన్యాయం జరిగిందని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. 8లో▸

ప్రశాంతంగా టీఎస్ పీజీ ఈసెట్

సాక్షి,సిటీబ్యూరో: జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో టీఎస్ పీజీఈసెట్- 2023 పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మొదటి సెషన్‌లో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ, మెకానికల్ ఇంజినీరింగ్, రెండో సెషన్‌లో మధ్యాహ్నం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరీక్ష నిర్వహించారు. హైదరాబాద్, వరంగల్‌లో కలిపి ఉద యం 85.46 శాతం, మధ్యాహ్నం 89.26 శాతం హాజరైనట్లు జేఎన్‌టీయూహెచ్ వర్గాలు పేర్కొన్నాయి.

మీడియా, ఫైన్ ఆర్ట్స్‌లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని ఆంధ్ర మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బీఏ కర్ణాటక సంగీతం (ఫుల్‌టైం కోర్సు)తో పాటు పలు ఇతర ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో (షార్ట్ టర్మ్, పార్ట్‌టైం) ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉషాజ్యోతి మణి తెలిపారు. వివరాలకు 94417 68811, 97013 27539 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

నీటి సంరక్షణ భేష్

కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ బృందం కితాబు



కేంద్ర బృందానికి వివరాలు వెల్లడిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్

ఇబ్రహీంపట్నం రూరల్: జలశక్తి అభియాన్ ద్వారా నీటిని నిల్వ ఉంచే ప్రయత్నంలో భాగంగా ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోరుబావులు, చెక్ డ్యాంల నిర్మాణం చాలా బాగుందని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ బృందం కితాబిచ్చింది. కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ బృందం సభ్యుడు అంకిత్ మిశ్రా, డిప్యూటీ సెక్రటరీ అంకిత్ విశ్వకర్మ, సైంటిస్ట్‌లు మంగళవారం జిల్లాలో పర్యటించారు. అనంతరం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జలశక్తి అభియాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ వివరించారు. జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి, నాటిన మొక్కలను సంరక్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామ నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, ఉద్యాన శాఖ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సౌందరరాజన్‌కు చిలుకూరు ఆధ్యాత్మిక రత్న బిరుదు



మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం మేనేజింగ్ కమిటీ చైర్మన్, ప్రధాన అర్చకుడు సౌందరరాజన్‌కు చిలుకూరు ఆధ్యాత్మిక రత్న బిరుదు లభించింది. చిలుకూరులోని శ్రీ గురుబసవ గురు పాద లింగ మఠం వారు సౌందరరాజన్‌కు చిలుకూరు ఆధ్యాత్మిక రత్న బిరుదును ప్రదానం చేశారు. ఇటీవల చిలుకూరు బాలాజీ దేవాలయం సమీపంలోని శ్రీ గురుబసవ గురుపాద లింగ మఠంలో జరిగిన కార్యక్రమంలో సౌందరరాజన్ తరఫున హాజరైన ఆయన కుమారుడు రంగరాజన్‌కు బిరుదు, ప్రశంసా పత్రాన్ని అందజేసి సన్మానించారు. వృద్ధాప్యం కారణంగా సౌందరరాజన్ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు పురాణం వీరభద్రస్వామి, నాయకులు సుధాకర్, లింగస్వామి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మెట్లబావి

- బన్సిలాల్‌పేట తరహా అభివృద్ధి చేస్తాం
- మంత్రి సబితారెడ్డి



పురాతన కోనేరు మెట్ల బావిని పరిశీలిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఇతర అధికారులు

మహేశ్వరం: కాకతీయ చరిత్ర ఉట్టి పడేలా మహేశ్వరంలో పురాతన కోనేరు మెట్ల బావిని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని విద్యా శాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మండల కేంద్రంలోని కోనేరు మెట్ల బావిని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బన్సీలాల్‌పేటలోని మెట్లబావి తరహాలో మహేశ్వరం మెట్ల బావిని సుమారు రూ.కోటి నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. పురాతన కట్టడాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అంతకు ముందు టీఎస్ఐఐసీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, రెవె న్యూ ఇతర శాఖల అధికారులతో మెట్ల బావి అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రవికుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ విజయ్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మహమూద్ అలీ, మహేశ్వరం సర్పంచ్ ప్రియంక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు ఆదిల్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చలానా.. అంతేనా..!



- 'ధరణి' పోర్టల్‌తో తంటా
- అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్లు రద్దయితే ఇక అంతే..
- అప్పటికే చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజు వాపస్‌రాని వైనం
- కొనుగోలుదారుల డబ్బులు ఏళ్లుగా ప్రభుత్వ ఖాతాలోనే..
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో బాధితులు

మొయినాబాద్‌కు చెందిన ఓ రియల్టర్ ఇటీవల ఫరూఖ్‌నగర్ మండలం హాజీపూర్ రెవెన్యూ పరిధిలో 6.20 ఎకరాలు కొనుగోలు చేశాడు. ఈ మొత్తం భూమి 20 సర్వే నంబర్లలో ఉంది. మొత్తాన్ని ఒకే డాక్యుమెంట్‌పై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ మేరకు 'ధరణి' పోర్టల్‌లో స్లాట్ బుక్ చేయించి, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.4 లక్షలు మీసేవా ద్వారా చెల్లించాడు. డాక్యుమెంట్ సిద్ధం చేసుకుని, ముందే బుక్ చేసుకున్న స్లాట్ ప్రకారం రిజిస్ట్రేషన్‌కు వెళ్లగా సైట్ తెరుచుకోకపోగా గంటల తరబడి 'బఫరింగ్' అవుతోంది. చేసేది లేక అధికారుల సూచన మేరకు ఐదు సర్వే నంబర్లకు ఒక డాక్యుమెంట్ చొప్పున మొత్తం నాలుగు డాక్యుమెంట్లను తయారు చేయించి మళ్లీ రిజిస్ట్రేషన్‌కు వెళ్లాడు. అంతకు ముందు ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన రూ.4 లక్షల చలానా డబ్బులు వాపస్ రాకపోవడంతో మళ్లీ అంతే ఫీజు చెల్లించాల్సి వచ్చింది.

బాలాపూర్‌కు చెందిన ఓ రియల్టర్ మహేశ్వరంలో రెండెకరాలు కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కోసం ధరణిలో స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంట్‌ను సిద్ధం చేసుకున్నాడు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1.40 లక్షలు డాక్యుమెంట్ రైటర్ బ్యాంక్ అకౌంట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. తీరా రిజిస్ట్రేషన్ సమయంలో విక్రయదారుని సోదరి ఈ భూమిపై కేసు వేసింది. అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. చలానా రూపంలో ఆయన చెల్లించిన ఫీజు మాత్రం ఇప్పటికీ తిరిగి రాలేదు.

శంకర్‌పల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి చేవెళ్ల సమీపంలో మూడెకరాలు కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని రూ.1.30 లక్షలు చలానా రూపంలో చెల్లించాడు. తీరా ఆ భూమిని విక్రయించేందుకు యజమాని నిరాకరించడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటికే చలానా రూపంలో చెల్లించిన సొమ్ము వెనక్కి ఇవ్వాల్సిందిగా అధికారులను అభ్యర్థించినా ఫలితం లేకపోయింది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పోర్టల్ ద్వారా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 27 తహసీల్దార్ కార్యాలయాలు ఉండగా, ఒక్కో కార్యాలయంలో రోజుకు సగటున 30 నుంచి 50 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. సాధారణంగా కొనుగోలుదారులు తమ భూముల రిజిస్ట్రేషన్ కోసం ముందు ధరణిలో తమ పేరున స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దస్తావేజును తయారు చేయించుకోవడంతో పాటు మార్కెట్ విలువ మేరకు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు ముందే చెల్లించాల్సి ఉంది. ఏదైనా అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ నిలిచిపోతే.. అంతకు ముందే బుక్ చేసిన స్లాట్‌ను మరో తేదీకి వాయిదా వేసుకోవచ్చు. ఇందుకు అపరాధ రుసుం రూ. 500 నుంచి రూ.1,500 చెల్లించాల్సి ఉంది. ఒకవేళ కోర్టు కేసులు, ఇతర అభ్యంతరాలతో అర్థంతరంగా రిజిస్ట్రేషన్ రద్దయితే..అప్పటికే డాక్యుమెంట్ రైటర్ అకౌంట్ నుంచి కానీ సొంత అకౌంట్ నుంచి కానీ చెల్లించిన చలానా సొమ్ము రావడం లేదు.

జిల్లాలో 250 మందికిపైగా బాధితులు

రిజిస్ట్రేషన్ రద్దు చేసుకున్న వారు ఏ లాగిన్ నుంచైతే స్లాట్ బుక్ చేసుకున్నారో? మళ్లీ అదే లాగిన్‌లో క్యాన్సిల్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఆ సందర్భంలో అతని బ్యాంక్ అకౌంట్ నంబర్ కూడా అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత అది కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. క్యాన్సిల్ దరఖాస్తులను కలెక్టర్ ఆమోదిస్తున్నా.. వారి అకౌంట్లలో నగదు జమకావడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 250 మంది ఈ తరహా బాధితులు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒక్క ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోనే 12 మంది ఉండటం గమనార్హం. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని కలెక్టరేట్ చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇప్పటివరకు రాలేదు..

రిజిస్ట్రేషన్ చలానా ఫీజు రూ.3.20 లక్షలు డాక్యుమెంట్ రైటర్ ఎకౌంట్ నుంచి చెల్లించాను. ఆఖరి నిమిషంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. చలానా డబ్బులు మాత్రం ఇప్పటికీ తిరిగి రాలేదు. చెల్లించిన డబ్బును ఇప్పించాలని ఇప్పటికే పలుమార్లు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాను. ఇప్పటి వరకు రాలేదు.

– రాజేందర్‌రెడ్డి, శంకర్‌పల్లి

వడ్డీ మీద పడుతోంది

సర్వే నంబర్లు ఎక్కువగా ఉండటంతో ధరణి వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. రోజుల తరబడి సైట్ క్లిక్ చేస్తే బఫర్ అవుతుందే కానీ సైట్ మాత్రం ఓపెన్ కాలేదు. అప్పటికే రూ.4 లక్షలు రిజిస్ట్రేషన్ ఫీజు మీ సేవా ద్వారా చెల్లించాను. రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. డబ్బులు మా త్రం తిరిగి రాలేదు. అప్పు తెచ్చి కట్టాను. వడ్డీ మీద పడుతోంది.

– గణేశ్, షాద్‌నగర్



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

మరో పదిహేనేళ్లు మాదే అధికారం

- సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని విధాలా అభివృద్ధి
- దేశంలోనే నంబర్ వన్ స్థానం
- సంక్షేమ పాలన బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- సంక్షేమం కావాలో.. సంక్షోభం కావాలో ప్రజలే తేల్చుకోవాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం మరో 15 ఏళ్ల అధికారంలో ఉండటం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో రూ.161.73 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి అభివృద్ధి పథకాలను చేపడుతున్నారని తెలిపారు. ప్రజల కష్టాలు తొలగాలన్నా, బాధలు పోవాలన్నా, సంక్షేమ పాలన కొనసాగాలన్నా అది బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం కేసీఆర్ పాలన కావాలో, రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేసే కాంగ్రెస్, బీజేపీ పాలన కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. సమైక్య పాలనలో తెలంగాణను చిన్నచూపు చూశారని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. సమావేశంలో ఎమ్మెల్సీ వాణీదేవి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భీష్వ కిష్టయ్య, వాల్యా నాయక్, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మురళీ యాదవ్, రాజావరప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మన్నె కవిత, నారాయణ, కొందూటి నరేందర్, ఎంఎస్ నటరాజన్, విశ్వం, జూపల్లి కౌసల్య, శంకర్, శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మీ నర్సింహారెడ్డి, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

యువత ఉపాధికి చేయూత



ప్రహరీని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి

రహమత్‌నగర్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్- మే) ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు అందిస్తోందని కేంద్రమంత్రి నారాయణ తాతు రాణే అన్నారు. రహమత్‌నగర్‌లో 'నిమ్స్ మే' మైదానంలో నూతనంగా నిర్మించిన ప్రహరీని మంగళవారం ఆయన ప్రారంభించారు. నగరంలో విశాలమైన ప్రదేశంలో 'నిమ్స్ మే' కార్యాలయం కొనసాగుతూ అనేక మంది యువత భవిష్యత్తుకు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాస్ శర్మ, సీపీడబ్ల్యూడీ సీఈ అశోక్, ఈఈ రామారావు, ఏఈ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నీవు లేక నేను లేను

- కలిసి జీవించలేమన్న బాధతో ఇరువురి ఆత్మహత్య
- ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో వివాహేతర బంధం
- ప్రియురాలి బలవన్మరణంతో యువకుడి మనస్తాపం
- పురుగుల మందు తాగి అసువులు బాసిన రాజేష్
- కొలిక్కివచ్చిన కుంట్లూరు 'మృతదేహం' కేసు
- అయినా ఇంకా పూర్తిస్థాయిలో వెల్లడి కాని వివరాలు



సాక్షి, సిటీబ్యూరో: కలకలం రేపిన యువకుడు రాజేష్ మృతి కేసు కొలిక్కి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివరాలు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులోని డాక్టర్స్ కాలనీ సమీపంలో సోమవారం కుళ్లిపోయిన స్థితిలో అల్లెపుల రాజేశ్ (24) మృతదేహం లభించిన సంగతి తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో పోలీసుల కీలక ఆధారాలు గుర్తించారు. మృతుడి సెల్‌ఫోన్ కాల్ డేటాలో చివరిసారిగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో మాట్లాడినట్లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతుడు రాజేష్‌కు, ఆమెకు మధ్య ఉన్న సంబంధాలపై పోలీసులు లోతుగా ఆరా తీశారు. ఈమేరకు ఆమె భర్త, బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ములుగు జిల్లాకు చెందిన రాజేశ్‌కు ఆరు నెలల క్రితం సామాజిక మాధ్యమంలో హయత్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో పరిచయం ఏర్పడింది. సోషల్ మీడియాలో ఆమె ఫొటోలు చూసి వివాహం కాలేదని భావించిన రాజేశ్.. ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కొంతకాలంగా వీరిద్దరూ తరచూ కలుసుకుంటున్నారు. ఈ క్రమంలో వీరి సంబంధం గురించి ఆమె భర్తకు తెలియడంతో మందలించాడు. దీంతో ఆమెకు వివాహమై పిల్లలు ఉన్నారన్న విషయం రాజేశ్‌కు తెలియడంతో ఆమెను దూరం పెట్టడం మొదలుపెట్టాడు. మనస్తాపానికి గురైన ఆమె తాను చనిపోతానంటూ రాజేశ్‌తో వాట్సాప్‌లో మెసేజ్ పెట్టింది. కలిసి జీవితాంతం ఉండలేనప్పుడు కలిసి చనిపోదామని భావించిన టీచరు, రాజేశ్ ఇరువురూ.. మే 24న హయత్‌నగర్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేశారు. ఈ మేరకు స్థానికంగా ఉన్న సీసీ టీవీ కెమెరాల పరిశీలనలో పోలీసులు గుర్తించారు. అదే రోజు ఉపాధ్యాయురాలు ఆమె ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.

ప్రియురాలి మరణ వార్త విని..

ఉపాధ్యాయురాలు చావు బతుకుల్లో ఆస్పత్రిలో ఉన్న విషయం తెలియక ఆమెకు రాజేశ్ వాట్సాప్ సందేశాలు, కాల్స్ చేశాడు. పదే పదే రాజేశ్ నుంచి ఫోన్లు రావటంతో ఆ ఫోన్ కుటుంబ సభ్యుల లిఫ్ట్ చేశారు. రాజేశ్ టీ షాపు దగ్గర ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లిన ఆమె కుటుంబ సభ్యులు రాజేశ్‌ను గట్టిగా మందలించారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రియురాలు మరణించిన విషయం రాజేశ్‌కు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. తాను ఉండేది స్నేహితుడి గదితో కాబట్టి ఆత్మహత్య చేసుకోలేక.. శివారు ప్రాంతమైన అబ్దుల్లాపూర్‌మెట్‌కు చేరుకున్నాడు. అదే రోజు (మే 24) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శివారు ప్రాంతం కావటంతో మృతదేహాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. 3-4 రోజులలో మృతదేహం కుళ్లిపోవటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రాజేశ్ మృతదేహానికి దుస్తులు లేకుండా ఉన్న స్థితిలో పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయురాలి మరణం అనంతరం ఆగ్రహంతో ఆమె కుటుంబ సభ్యులు రాజేశ్ మృతి చెందిన సంఘటన స్థలానికి వచ్చి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈక్రమంలో పోలీసులు తదుపరి విచారణ సాగిస్తున్నారు.

విషమిచ్చి నా భార్యను చంపేశారు

రాజేశ్ మృతి కేసుతో తనకెలాంటి సంబంధం లేదని టీచరు భర్త మీడియాకు తెలిపారు. అతడిపై దాడి చేశామన్న వార్తలలో వాస్తవం లేదని తేల్చి చెప్పారు. తన భార్యకు, రాజేష్‌తో సామాజిక మాధ్యమాలలో పరిచయం ఏర్పడి ఉండొచ్చని, వాళ్లిద్దరికి వయసులోనూ చాలా తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. తన భార్యను ఎవరో బ్లాక్‌మెయిల్ చేసి భయపెట్టారని, ఎవరో విషం ఇచ్చి హత్య చేశారని ఆయన ఆరోపించారు. ఈ కేసులో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఆయన పోలీసులను కోరారు.

లైంగిక నేరగాళ్లపై నిఘా పెట్టాం

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

సాక్షి, సిటీబ్యూరో: మైనర్లపై అత్యాచారం, హత్య వంటి ఘోరమైన నేరాలకు పాల్పడిన లైంగిక నేరగాళ్లపై సైబరాబాద్ పోలీసులు నిఘా పెట్టారు. గత అయిదేళ్లలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో లైంగిక నేరాలకు పాల్పడిన 143 మందిని తనిఖీలు చేయడం, నివాస ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం, ఇతర ప్రాంతాలలో ఏమైనా నేరాలకు పాల్పడితే ఆయా వివరాలను నవీకరించడం వంటి కార్యక్రమానికి సైబరాబాద్ పోలీసులు శ్రీకారం చుట్టారు. మాదాపూర్, రాజేంద్రనగర్, బాలానగర్, మేడ్చల్, శంషాబాద్ జోన్లలో తనిఖీలు చేపట్టినట్లు సీపీ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కోసం లైంగిక నేరస్తులపై నిఘా పెట్టడం అత్యవసరమని, గ్రౌండ్ ఇంటెలిజెన్స్, బీట్ పోలీసింగ్ వంటి విస్తృత నెట్‌వర్క్ ద్వారా నేరస్తుల కార్యకలాపాలపై ఆరా తీస్తున్నామని చెప్పారు.



కబడ్డీలో తలపడుతున్న మహిళా క్రీడాకారులు



వాలీబాల్‌లో తలపడుతున్న మహిళా జట్లు

క్రీడాకారులకు ప్రభుత్వం అండ

- జిల్లా యువజన క్రీడాధికారి వెంకటేశ్వర్‌రావు
- కొనసాగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులకు అండగా నిలుస్తుందని జిల్లా యువజన క్రీడాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2023 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను మంగళవారం సరూర్‌నగర్ స్టేడియంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు రోజులుగా వాలీబాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఫైనల్స్ ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బాలరాజు, స్వర్ణలత, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే ..

వాలీబాల్ (పురుషుల విభాగం): ములుగు- భువనగిరి తలపడగా ములుగు, వికారాబాద్- సూర్యాపేట పోటీపడగా వికారాబాద్, ఆదిలాబాద్- హనుమకొండ పోటీలో ఆదిలాబాద్, రంగారెడ్డి- సిరిసిల్ల మ్యాచ్‌లో రంగారెడ్డి, జనగాం - సిద్దిపేట తలపడగా జనగాం, యాదాద్రి- మేడ్చల్ పోటీలో యాదాద్రి, వికారాబాద్- గద్వాల మ్యాచ్‌లో వికారాబాద్, నారాయణపేట- నల్లగొండ మధ్య జరిగిన పోటీలో నారాయణపేట, జగిత్యాల- నాగర్‌కర్నూల్ తలపడగా జగిత్యాల, పెద్దపల్లి- హనుమకొండ మ్యాచ్‌లో పెద్దపల్లి, కరీంనగర్- నల్లగొండ పోటీలో కరీంనగర్, వనపర్తి- నిర్మల్ తలపడగా వనపర్తి, మహబూబాబాద్- కొమురం భీం మ్యాచ్‌లో మహబూబాబాద్ జిల్లా జట్లు గెలుపొందాయి.

వాలీబాల్ (మహిళల విభాగం): వరంగల్- మంచిర్యాల తలపడగా వరంగల్, హైదరాబాద్- కొత్తగూడెం మ్యాచ్‌లో హైదరాబాద్, కరీంనగర్- నాగర్‌కర్నూల్ పోటీలో కరీంనగర్, కొత్తగూడెం- హనుమకొండ మ్యాచ్‌లో కొత్తగూడెం, మహబూబాబాద్- మహబూబ్‌నగర్ తలపడగా మహబూబాబాద్, గద్వాల- జగిత్యాల ఆడగా గద్వాల, నాగర్‌కర్నూల్- భువనగిరి పోటీలో నాగర్‌కర్నూల్, వికారాబాద్- భూపాలపల్లి తలపడగా వికారాబాద్, సూర్యాపేట- మెదక్ పోటీలో సూర్యాపేట, వనపర్తి- హనుమకొండ మధ్య వనపర్తి, మహబూబాబాద్- హనుమకొండ పోటీపడగా మహబూబాబాద్, జనగాం-గద్వాల మ్యాచ్‌లో జనగాం, సంగారెడ్డి- సిరిసిల్ల పోటీలో సంగారెడ్డి, నిజామాబాద్- సిద్దిపేట మధ్య జరిగిన పోటీలో నిజామాబాద్ జట్లు విజయం సాధించాయి.

కబడ్డీ (మహిళా విభాగం): నిజామాబాద్- కొత్తగూడెం తలపడగా కొత్తగూడెం, ఆదిలాబాద్- వనపర్తి పోటీలో ఆదిలాబాద్, నల్లగొండ- ములుగు మ్యాచ్‌లో నల్లగొండ, సూర్యాపేట- మంచిర్యాల పోటీపడగా సూర్యాపేట, జనగాం- నాగర్‌కర్నూల్ మ్యాచ్‌లో జనగాం, రంగారెడ్డి- మహబూబాబాద్ తలపడగా రంగారెడ్డి, హనుమకొండ- కామారెడ్డి పోటీలో కామారెడ్డి, ఖమ్మం-హైదరాబాద్ మధ్య జరిగిన పోటీలో ఖమ్మం, వరంగల్- మేడ్చల్ పోటీలో మేడ్చల్, కొత్తగూడెం- ఆదిలాబాద్ పోటీపడగా కొత్తగూడెం, వనపర్తి- వికారాబాద్ మధ్య సాగిన పోటీలో వనపర్తి, మహబూబ్‌నగర్- జగిత్యాల తలపడగా మహబూబ్ నగర్ జట్లు విజేతలుగా నిలిచాయి.

కబడ్డీ (పురుషుల విభాగం): గద్వాల- నారాయణపేట మధ్య గద్వాల, రంగారెడ్డి- కొత్తగూడెం తలపడగా రంగారెడ్డి, నల్లగొండ- వనపర్తి పోటీలో నల్లగొండ, మేడ్చల్- ఖమ్మం పోటీలో మేడ్చల్, సూర్యాపేట- సంగారెడ్డి మ్యాచ్‌లో సూర్యాపేట, యాదాద్రి- సిద్దిపేట తలపడగా యాదాద్రి, జనగాం- హైదరాబాద్ జట్లు పోటీపడగా జనగాం, సిరిసిల్ల- జగిత్యాల మధ్య సాగిన పోటీలో సిరిసిల్ల, వరంగల్- జగిత్యాల తలపడగా వరంగల్, ములుగు- పెద్దపల్లి పోటీపడగా ములుగు జట్లు విజయం సాధించాయి. మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం


నర్సింహ (ఫైల్)


అనిల్ (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.మధుసూదన్ తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్‌లోని ఇంద్రానగర్‌కు చెందిన స్వప్న మోని శైలజ, నర్సింహ దంపతులు. ఏప్రిల్ 29న దంపతుల మధ్య గొడవ జరిగి నర్సింహ భార్యపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె పిల్లలతో కలిసి జల్‌పల్లిలో శ్రీరాం కాలనీలో నివాసం ఉండే సోదరి ఇంటికి వెళ్లింది. నర్సింహ అక్కడికి వెళ్లి మరోసారి గొడపడి వెళ్లిపోయాడు. రెండు రోజుల తర్వాత భార్య వచ్చిచూడగా కనింపించలేదు. గతంలో గొడవపడినపుడు ఇంట్లోనుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడు. నెల రోజులైనా తిరిగి రాకపోవడం.. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భార్య మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం అందించాలని కోరారు.

పిట్టలగూడలో యువకుడు..

నందిగామ: సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిన యువకుడు నెలరోజులైనా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. నందిగామ ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం నందిగామ అనుబంధ గ్రామం పిట్టలగూడకు చెందిన మామిళ్లపల్లి అనిల్(22) ఏప్రిల్ 30న మొబైల్ ఇంట్లో పెట్టి ఎవరికీ చెప్పకుండా బైక్‌పై బయటకు వెళ్లాడు. నాటి నుంచి ఎక్కడ వెతికినా యువకుడి ఆచూకీ లభించలేదు. దీంతో అనిల్ తండ్రి మంగళవారం శంకరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

‘ప్రజాగర్జన’ను విజయవంతం చేయండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి


మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో భద్రాద్రి నిర్వహిస్తున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భూ పోరాట కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమల రాజ్యాంగ, లౌకిక, వ్యవస్థల పరిరక్షణకు సీపీఐ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తోందన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరైన సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. 107 రోజులుగా భూపోరాట కేంద్రంలతో ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పందించి వారికి కనీస వసతులు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, గండిపేట్ మండల కార్యదర్శి బాబురావు, నాయకులు శ్రీను, సాయిలమ్మ, మాధవి, విజయమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

కల్తీ పాల విక్రేత అరెస్టు

800 లీటర్ల పాలు సీజ్

మంచాల: కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్న ఓ పాల వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. మంచాల ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. జాపాల గ్రామానికి చెందిన సయ్యద్ హైమద్ కొన్ని రోజులుగా పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు మంగళవారం దాడి చేసి 800 లీటర్ల పాలను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. పాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్ పంపామని.. ఫలితాల్లో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


సర్వీసింగ్ సెంటర్‌లో ఎగిసిపడుతున్న మంటలు.. దగ్ధమవుతున్న కార్లు

అగ్గికి కార్లు బుగ్గి..

రూ.50 లక్షల ఆస్తినష్టం





లింగోజిగూడ, వనస్థలిపురం: కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ బీవీకే సినిమా థియేటర్ పక్కనే ఉన్న సద్గుర్ నగర్ కాలనీలోని కారు–ఓ– మ్యాన్ సర్వీసింగ్ సెంటర్‌లో మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అప్పటికే మంటలు భారీగా ఎగిసిపడుతుండడంతో హయత్‌నగర్‌తో పాటు మలక్‌పేట్, గౌలిగూడ, మల్కాజిగిరి, మౌలాలీ అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 15 కార్లు దగ్ధమైనట్లు సమాచారం. అగ్ని ప్రమాదం సమయంలో సర్వీసింగ్ సెంటర్‌లో గ్యాస్ ఆధారిత కార్లు ఉండడంతో మంటలు వ్యాపించి భారీ శబ్దాలు వచ్చాయి. దీంతో పక్కనే బీవీకే సినిమా హాల్‌లోని ప్రేక్షకులు బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలంలో ఉన్న పోలీసులు సర్వీసింగ్ సెంటర్ పక్కనే ఉన్న శ్రీలక్ష్మి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులను ఫ్లాట్ల లోంచి బయటకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

తాగి వేధిస్తున్నాడని భార్యే హతమార్చింది..

- వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితురాలి అరెస్టు

శంషాబాద్ రూరల్: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను భార్యే హతమార్చింది. రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి దాడి చేయడంతో తన భర్త చనిపోయినట్లు పోలీసులను నమ్మించింది. చివరకు పోలీసులు ఈ కేసును ఛేదించి అసలు నిందితురాలు భార్యే అని తేల్చారు. ఈమేరకు మంగళవారం ఆమెను అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జూకల్ శివారులోని మామిడితోటలో గాదిరాజు వెంకటరాజు, నాగమణి దంపతులు కొంత కాలంగా పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. ఈ నెల 14న రాత్రి వెంకటరాజుపై దాడి జరగడంతో మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తన భర్త చనిపోయాడని, తనపై స్ప్రే కొట్టి..మెడలోని పుస్తెలతాడు దుండగులు లాక్కెళ్లారని నాగమణి పోలీసులకు తెలిపింది.

దర్యాప్తుతో నిజం బయటకు..

కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మృతుడి భార్యపై అనుమానం వచ్చింది. అక్కడ ఉన్న ఆధారాలు, నాగమణి చెబుతున్న వివరాలకు ఎలాంటి పొంతన కుదరకపోవడంతో పోలీసులు మరో రకంగా కేసు దర్యాప్తు మొదలు పెట్టారు. దీంతో భర్తను తానే హత్య చేసినట్లు నాగమణి ఒప్పుకుంది. నిత్యం తాగి వచ్చి తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడని తెలిపింది. ఈ నెల 14న రాత్రి కూడా తాగి వచ్చి వేధించడంతో గొడ్డలితో హత్య చేసింది. ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు యత్నించింది. హత్యకు వినియోగించిన గొడ్డలి, దొంగిలించుకుపోయినట్లు చెప్పిన పుస్తెలతాడును మామిడితోటలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.

ప్రాణం తీసిన పొలం పంచాయితీ

- తమ్ముడికి తెలియకుండా పొలం విక్రయించిన అన్న
- న్యాయం చేయాలని కొనుగోలుదారుడిని కోరిన శంకర్‌నాయక్
- స్పందించక పోవడంతో బలవన్మరణం


స్టేషన్ ఎదుట రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

కొత్తూరు: తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి వాటా విషయంలో అన్యాయం జరిగిందని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోనికొడిచర్లతండాలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ బాలరాజు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్, శంకర్‌నాయక్(43) అన్నదమ్ములు. వారి తండ్రి పేరుమీద ఉన్న 23 గుంటల భూమికి లక్ష్మణ్‌నాయక్ పేరిట పట్టాపాస్‌బుక్ వచ్చింది. ఈ పొలాన్ని లక్ష్మణ్‌నాయక్ పదేళ్ల క్రితం పీర్యానాయక్ అనే వ్యక్తికి విక్రయించాడు. ఇటీవల విషయం తెలుసుకున్న శంకర్‌నాయక్ కొనుగోలుదారుడిని ఫోన్‌లో తనకు రావాల్సిన వాటా విషయంలో అన్యాయం జరిగిందని.. న్యాయం చేయాలని కోరాడు. అందుకు ఆయన స్పందించకపోవడంతో తండా శివారులో పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన పక్క పొలం వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు శంకర్‌నాయక్ చావుకు పీర్యానాయక్ కారణమని ఆరోపిస్తూ పీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. పీర్యానాయక్ ఓ అత్యున్నత శాఖలో ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ వివరించారు.

పీహెచ్‌సీలో నాగుపాము

- భయంతో చంటి బిడ్డను తీసుకొని పరుగులు తీసిన బాలింత
- అందుబాటులోని వైద్య సిబ్బంది..
- స్థానికుల ఆగ్రహం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బయట చంటి బిడ్డతో కూర్చున్న అరుణ కుటుంబ సభ్యులు

శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి నాగు పాము రావడంతో ఓ బాలింత భయంతో పరుగులు తీసింది. శంకర్‌పల్లి మండలం మోకిల తండాకు చెందిన అరుణ ప్రసవం కోసం మంగళవారం ఉదయం 9.20గంటలకు 108 వాహనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. 11గంటలకు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఉంటున్న గదిలోని మంచం కింద రాత్రి 7.20గంటలకు నాగుపాము కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన అరుణ.. చంటిబిడ్డతో బయటకు పరుగు తీసింది. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి అరుణకు ఏమి కాదని ధైర్యం చెప్పి ఆస్పత్రి బయట కూర్చోబెట్టారు. విషయం దావానంలా వ్యాపించడంతో స్థానికులతో కలసి వైద్యసిబ్బంది నాగుపాము కోసం వెతికినా కనిపించలేదు. కుటుంబ సభ్యులొచ్చి ఆరుణను ఆటోలో ఇంటికి తీసుకువెళ్లారు. కాగా, బాలింత ఆస్పత్రిలో ఉన్న సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఆస్పత్రి పరిసర ప్రాంతం పిచ్చి మొక్కలతో నిండి ఉందని, కనీసం లైట్లు కూడా సక్రమంగా వెలుగవనిరోగులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా ‘కాలేజీ అడ్మిషన్స్ డీకోడెడ్’

మంత్రి సబితారెడ్డి

ఇబ్రాహీంపట్నం రూరల్: అడ్మిషన్స్ సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు సరైన నిర్ణయం తీసుకునేందుకు కాలేజ్ అడ్మిషన్స్ డీకోడెడ్ పుస్తకం ఉపయోగ పడుతుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె ప్రముఖ విద్యావేత్త, రచయిత ఎస్.సుధీర్‌రెడ్డి రచించిన కాలేజ్ అడ్మిషన్స్ డీకోడెడ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డిని ఆమె అభినందించారు. రచయిత సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంసెట్‌తో సహా వివిధ పోటీ పరీక్షలకు హాజరైన వారు తదుపరి చేరాల్సిన కోర్సులు, కళాశాలలు లాంటి వివరాలతో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, ఎస్.చెన్నారెడ్డి, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- ప్యాకింగ్‌లేని సీడ్స్ సీజ్
- షాపుల యజమానులపై కేసు

చేవెళ్ల: నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేసేందుకు విజిలెన్స్, వ్యవసాయాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోమ, మంగళవారం నిర్వహించిన ఈ తనిఖీల్లో ప్యాకింగ్ లేకుండా అమ్ముతున్న విత్తనాలు సీజ్ చేసి మూడు దుకాణాల యజమానులపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారి రఘురాం, విజిలెన్స్ సీఐ చంద్రమోహన్, చేవెళ్ల వ్యవసాయాధికారి తులసి తెలిపిన ప్రకారం.. రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో అయ్యప్ప ఫెర్టిలైజర్, రాఘవేంద్ర హోల్‌సేల్ దుకాణం, మరో సంచుల దుకాణంలో ప్యాకింగ్ లేకుండా లూజ్‌గా విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మెంతులు, ధనియాలు, పాలకూర, తోటకూర, గోంగూర తదితర ఆకుకూర విత్తనాలు తనిఖీల్లో పట్టుబడ్డాయి. వీటిని సీజ్ చేసి పోలీసులకు అప్పగించామని చెప్పారు. లైసెన్స్‌లు లేకుండా ప్యాకింగ్‌లేని విత్తనాలు విక్రయాలు చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా మూడు దుకాణాల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.